క్లుప్తంగా

'సిరిమాను'కు ప్రత్యేక పూజలు



సిరిమాను చెట్టుకు పూజలు చేస్తున్న బర్లి గ్రామస్తులు

బలిజిపేట: గజాలమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని బర్లి గ్రామంలో సిరిమాను చెట్టుకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మే 8, 9, 10వ తేదీల్లో జరిగే ఉత్సవాల్లో నిర్వహించే సిరిమానోత్సవానికి ఈ సిరిమానును సిద్ధం చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.అప్పలనాయుడు, పూజారి గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఒక్కపూటే పని చేయించాలి



వేతనదారులకు సూచనలిస్తున్న సీపీఎం మండల కార్యదర్శి ఈశ్వరరావు

సీతానగరం: ఎండల తీవ్రత కారణంగా ఉపాధి హామీ పనుల వేతనదారులతో ఒక్కపూట మాత్రమే పని చేయించాలని సీపీఎం మండల కార్యదర్శి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని ఆర్‌టీబీ సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆదివారం పరిశీలించిన ఆయన వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేతనదారులు పనికి వచ్చేటప్పుడు వాటర్‌బాటిల్‌తో నీరు తీసుకురావాలన్నారు. అలాగే పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

సాలూరు: చేనేత కార్మికులు అన్ని రంగాల్లో రాణించాలని చేనేత కార్మికుల సమాఖ్య జాతీయ సభ్యుడు కైలసాని సాయికుమార్ నేత కోరారు. స్థానిక పట్టణంలోని నాయుడు వీధిలో ఉన్న రామమందిరంలో సాలూరు కైకాల చేనేత యువగళం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కైకాల చేనేత ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఆయన చేనేత కార్మికుల సంక్షేమం ఉద్దేశించి, ప్రసంగించారు. దేశంలోని తొమ్మిది రాష్ట్రాల్లో చేనేత కార్మికులు అధికంగా ఉన్నారని, వారంతా ఐక్యమత్యంగా ఉండి విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో రాణించి, అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం చేనేత కార్మికుల సమస్యలపై చర్చించి, అభివృద్ధి, సంక్షేమంపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు శివరాంప్రసాద్, శివప్రసాద్, కొడిపల్లి రాజ, వెంకటరమణ, ప్రభాకరరావు, అప్పారావు, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే



ఆర్వో ప్లాంట్ ప్రారంభించి, మహిళలకు నీటిని అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం: మండలంలోని నిడగల్లు గ్రామంలో రూ.3 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదివారం రాత్రి ప్రారంభించారు. జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకు వెళ్తున్న ప్రజాప్రతినిధుల దృష్టికి గ్రామస్తుల తాగునీటి సమస్య వచ్చిందని, అనుకున్నదే తడవుగా ఆర్వో ప్లాంట్ ఏర్పాటు, ప్రారంభం చేశామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, సర్పంచ్ ఆర్.ఆరుద్రమ్మ, నాయకులు గాజాపు శ్రీనివాసరావు, పరువాడ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

● తీరిన 'వే'దన



చిన్నరామకు నిర్మించిన రహదారి

సీతంపేట: చిన్నరామ గ్రామానికి సరైన రహదారి లేక గత కొన్నేళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామానికి తారురోడ్డు నిర్మించారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి చొరవతో గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ ద్వారా సుమారు రూ.50 లక్షలతో రోడ్డు నిర్మించారు. త్వరలో ఈ రహదారిని ప్రారంభించనున్నట్టు ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఈఈ జి.మురళి తెలిపారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

● జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



సాలూరు: దివ్యాంగుడు సింహాచలంను ఆప్యాయంగా పలకరిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర



సీతానగరం: పెదబోగిలిలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎంపీటీసీ గౌరి



సీతానగరం: పెదంకలాంలో జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఎంపీపీ రవణమ్మ



సీతానగరం: బుడ్డిపేటలో ఇంటింటికీ మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించి, ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరిస్తున్న సచివాలయ కన్వీనర్ రమణ



సీతానగరం: కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీటీసీ పార్వతి, సర్పంచ్ సత్యవతి తదితరులు



బలిజిపేట: గంగాడలో ఇంటింటికీ వెళ్లి, జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమ స్టిక్కర్లు అతికిస్తున్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు

సాలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణంలో ఆదివారం పర్యటించిన ఆయనకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించి, నాలుగేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కొన్ని రోజుల క్రితం పదో వార్డు, నెయ్యిలవీధిలో పర్యటించిన డిప్యూటీ సీఎం రాజన్నదొరకు పెన్షన్ మంజూరు చేయాలని దివ్యాంగుడు మండాది సింహాచలం వినతించగా, ఇప్పుడు పెన్షన్ మంజూరు కావడంతో సదరు దివ్యాంగుడు డిప్యూటీ సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపాడు. దీంతో జై జగన్.. జై రాజన్న అని ప్రజలు నినాదాలు చేశారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, ప్రజలు బాగుండాలన్న ఉద్దేశ్యంతోనే అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గ్రామాల్లోని సచివాలయ వ్యవస్థ ద్వారా ఎన్నో రకాల ప్రజా సమస్యలు ఊరిలోనే పరిష్కారమవుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు సింగిడి గోవింద తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు న్యాయం..

సీతానగరం: మండలంలోని పెదంకలాం, పెదబోగిలి, బుడ్డిపేట గ్రామాల్లో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, గృహయజమానుల అనుమతి మేరకు వారి ఇంటి గోడలకు జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లు అతికించారు. అనంతరం నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు వివరించారు. పెదంకలాంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ బి.రవణమ్మ మాట్లాడుతూ సీఎం జగనన్న హయాంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతీ ఇంటికీ ఈ ప్రభుత్వం ద్వారా లబ్ధి జరుగుతోందన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని రంగాల్లో అన్ని వర్గాల వారికి అన్ని రకాలుగా న్యాయం చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని, ఇదే ప్రభుత్వాన్ని 2024లోనూ అధికారంలోకి తీసుకురావాలని కోరారు. పెదబోగిలిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీలు బి.కుసుమ, ఎస్.గౌరి తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట: మండలంలోని గంగాడ గ్రామంలో జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులంతా ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. అనంతరం ఇంటి గోడలపై జగన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించి, వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు.

సీతానగరం: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఎంపీటీసీ సభ్యురాలు టి.పార్వతి, సచివాలయ కన్వీనర్ సీహెచ్ సురేష్‌కుమార్, సర్పంచ్ టి.సత్యవతి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును వివరించారు.

అవగాహనతోనే అగ్నిప్రమాదాల నివారణ



పార్వతీపురం టౌన్: గ్యాస్ నుంచి ఎగసిపడుతున్న మంటలను ఎలా అదుపుచేయాలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



సాలూరు: అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

● పార్వతీపురం మన్యం అగ్నిమాపక అధికారి యు.సుధాకర్

పార్వతీపురం టౌన్: అగ్నిప్రమాదాలపై అవగాహన తప్పనిసరి అని, అవగాహనతోనే అగ్నిప్రమాదాలను నివారించవచ్చని పార్వతీపురం మన్యం అగ్నిమాపక అధికారి యు.సుధాకర్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ఆర్.కె.ఎ.క్లేవ్స్, విజయరామరాజునగర్ అపార్టమెంట్ వద్ద అగ్నిప్రమాదాల నివారణపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షార్ట్ సర్క్యూట్ ఎలా జరుగుతుంది.. గ్యాస్ నుంచి ఎగసిపడే మంటలను ఎలా అదుపు చేయాలన్న దానిని ప్రయోగాత్మకంగా వివరించారు. అనంతరం ప్రమాదంలో ఇరుకున్నప్పుడు దాని నుంచి సురక్షితంగా బయటపడడం, దానిని నివారించడం నేర్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఎల్.ఎఫ్.టి.ఉమామహేశ్వరరావు, అగ్నిమాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: అగ్నిప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పట్టణ అగ్నిమాపక శాఖ అధికారి పైడిరాజు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని వినాయక రెసిడెన్సీ వద్ద అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రమాదం బారినపడకుండా ప్రమాదాన్ని ఎలా అదుపుచేయాలన్న విషయం సిబ్బంది తెలిపారు. ప్రతిఒక్కరూ అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

నిర్మానుష్యంగా ప్రధాన రోడ్లు



నిర్మానుష్యంగా మక్కువ-అజ్జాడ ప్రధాన రోడ్డు

సీతానగరం: కొన్నిరోజులుగా మండుతున్న ఎండలకు ప్రధాన రోడ్లు, వీధులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఉదయం 10 గంటల నుంచే ఎండ విపరీతంగా కాస్తుండడంతో బయటకు వచ్చేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర పనుల నిమిత్తం బయటకు వెళ్లే వారు కూడా ఉదయం 11 గంటలయ్యేసరికి ఇళ్లకు చేరుకోవడంతో ఏ రోడ్లుపై కూడా వాహనాలు, పాదచారులు కనిపించే పరిస్థితి లేదు. సాయంత్రం 4 గంటల తర్వాతే జనం మళ్లీ రోడ్లుపై తిరుగాడుతున్నారు. వడదెబ్బ బారినపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పనులు, ఉద్యోగాల కోసం వెళ్లేవారు గొడుగు, వాటర్‌బాటిల్ వెంట తీసుకువెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు.

సంప్రదాయ విధానాలపై రైతుల ఆసక్తి



పొలంలో మందవేసిన గొర్రెలు

జియ్యమ్మవలస: రసాయన ఎరువుల వాడకం వల్ల ఎదురయ్యే సమస్యలపై వ్యవసాయాధికారులు తరచూ అవగాహన కల్పిస్తుండడంతో మండలంలోని రైతులు సేంద్రియ ఎరువుల వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు. తక్కువ పెట్టుబడితో పాటు అధిక దిగుబడిని సాధిస్తున్నారు. దీనివల్ల గొర్రెలు, మేకల పెంపకందారులకు అదనపు ఆదాయం లభిస్తోంది. వేసవిలో పొలాల్లో రైతులు గొర్రెలు మందలను వేయిస్తున్నారు. అలాగే దమ్ముకు ముందు పేడతో కూడిన పచ్చిరొట్టవేసి పంటలు సాగుచేస్తారు. దీంతో భూమి సారవంతం అవ్వడంతో దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయని రైతులంటున్నారు. మందల వల్ల మేకల పెంపకదారులకు అదనపు ఆదాయం లభిస్తోంది. ఎకరానికి వారం రోజులు పాటు మందను వేయిస్తే ఏడాదికి సరిపడా భూమికి కావల్సిన పోషకాలు లభించడంతోపాటు పంటలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని రైతులు చెబుతున్నారు.వేరుశనగ, అరటి, నువ్వులు, కాయగూరలు తదితర పంటలు సాగుతోపాటు వరి సాగు చేసే రైతులు గొర్రెల మందలు వేస్తుంటారు. దీంతో పాటు పశువుల గత్తం చెరువుల్లో ఉన్న మట్టిని కూడా పొలాల్లో వేస్తున్నారు. దీనివల్ల సారవంతంగా తయారవుతుందని రైతులు చెబుతున్నారు.

'కందుకూరి' గొప్ప సంఘ సంస్కర్త



వీరేశలింగం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న సంజీవనాయుడు

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామంలో నేతాజీ గ్రంథాలయంలో కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సమసమాజ స్థాపనకు ఆయన చేసిన కృషిని కొనియాడారు. కందుకూరి వీరేశలింగం గొప్ప సంఘ సంస్కర్త అని, స్త్రీలు, అంటరాని కులాలకు చెందిన పిల్లలు చదువుకునేందుకు పోరాటం సాగించారన్నారు. సమాజంలోని ప్రతిఒక్కరూ సమానమేనని, ఎవ్వరినీ తక్కువగా చూడకూడదని ఆయన చెప్పేవారన్నారు. అటువంటి మహనీయుల అడుగుజాడల్లో అందరూ నడవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు దయానంద్, ఎం.శ్రీను, కె.సతీష్, పి.భాస్కరరావు, బి.హర్ష, పి.పరశురామ్, బి.వెంకటరమణ పాల్గొన్నారు.

భూముల రీసర్వేను వేగవంతం చేయాలి



భూముల రీసర్వేను పరిశీలిస్తున్న సర్వే డీటీ చిట్టమ్మ

సీతానగరం: భూముల రీసర్వేను వేగవంతం చేయాలని సర్వే డీటీ పి.చిట్టమ్మ సూచించారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో జరుగుతున్న సమగ్ర భూముల సర్వేను ఆదివారం పరిశీలించిన ఆమె రైతుల సమక్షంలోనే సర్వే జరగాలని, హద్దురాళ్లను వారు ఉన్నప్పుడే వేయాలని తెలిపారు. అంతకుముందు రెండు విడతల్లో జరిగిన సర్వేపై తహసీల్దార్ ఎన్వీ రమణతో సమీక్షించారు. ప్రస్తుతం మూడో విడతలో భాగంగా లక్ష్మీపురం, కృష్ణారాయపురం, రామవరం గ్రామాల్లో సర్వే జరుగుతోందని మండల సర్వేయర్ శంకరరావు పేర్కొన్నారు. సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరిస్తూ సర్వే చేస్తున్నామని ఆయన అన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు: స్థానిక పట్టణంలో వైద్యుడు వాడాడ గణేశ్వరరావు ఆర్థికసాయంతో మీకై మేము అనే వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర ఆదివారం ప్రారంభించారు. అనంతరం అటువైపుగా వచ్చే పాదచారులు, ప్రయాణికులకు గ్లాసులతో మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి ఎండల నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు ఇటువంటి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందని, ఈ సందర్భంగా మీకై మేము వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు తన అభినందనలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై డిప్యూటీ సీఎం సమీక్ష



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: స్థానిక పట్టణంలోని తన స్వగృహంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర ఆదివారం సమావేశమై, పలు అభివృద్ధి పనులపై సమీక్షించారు. మున్సిపాలిటీ పరిధిలో 15వ ఆర్థిక సంఘం, గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా రూ.13 కోట్లు మంజూరు కాగా, ఇప్పటివరకు రూ.4 కోట్ల విలువైన పనులు మాత్రమే జరగడంపై అధికారులను ఆరాతీశారు. మిగతా రూ.9 కోట్ల నిధులకు సంబంధించి, పనులు ఎప్పుడు చేపడతారని అడిగారు. పనులు జరగకపోవడం వల్లే ప్రతిపక్షాలు అభివృద్ధి జరగడం లేదని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా పనులను వేగవంతం చేయాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నా, పనులు చేపట్టడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో జరిగిన పనులకు సంబంధించిన బిల్లులు కూడా ఈ ప్రభుత్వం చెల్లించిన విషయాన్ని కాంట్రాక్టర్లు గుర్తించాలన్నారు. పనులకు ఏవైనా అడ్డంకులుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, మున్సిపల్ కమిషనర్ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

పాలకొండ రూరల్: అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలని ఆ శాఖ అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సీఎల్ నాయుడు అపార్ట్‌మెంట్స్ వద్ద ఆదివారం అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన నిర్వహించారు. ఇళ్లలో గ్యాస్ లీకై అగ్నిప్రమాదాలు సంభవించినపుడు వాటిని ఏవిధంగా అడ్డుకోవాలో ప్రయోగాత్మకంగా వివరించా రు. గృహ, వ్యాపార సముదాల నిర్మాణ సమయంలో ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని సూచించారు.

అర్చకుడిని ఆదుకోండి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సిద్ధేశ్వర శ్రీశైలం

భామిని: ఆర్థిక కష్టాల్లో ఉన్న అర్చకుడి కుటుంబాన్ని ఆదుకోవాలని అతని స్నేహితులు కోరుతున్నారు. మండలంలోని పెద్దదిమిలి ఎండల మల్లికార్జున స్వామి ఆలయ అర్చకుడు సిద్ధేశ్వర శ్రీశైలం అనారోగ్యంలో బాధపడుతూ విశాఖపట్నంలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఏడాది కిందట ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లి పనిచేస్తుండగా.. తీవ్ర అస్వస్థతకు గురికావడంతో మూసాపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. సంపాదించిన డబ్బంతా వైద్యానికి ఖర్చయిపోవడంతో సొంతూరు చేరుకున్నాడు. ఆరోగ్యం విషమించడంతో స్నేహితులు విశాఖపట్నం మెడికవర్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్యానికి డబ్బులు లేక భార్య జ్యోతి, ఇద్దరు పిల్లలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దాతల సాయం కోసం అర్థిస్తున్నారు.

సాయం చేయదలచిన దాతలు ఫోన్‌పే నంబర్ **99897 75309**కు నగదు పంపించి ఆదుకోవాలని కోరుతున్నారు.